అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కలేనా?

- గత ప్రభుత్వంలో రూ.2.74 కోట్ల మంజూరు
- టోల్ ప్లాజా వద్ద స్థల సేకరణ
- స్టేషన్ లేక ప్రమాద సమయాల్లో భారీగా ఆర్థిక నష్టాలు

దేవరపల్లి: మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కొన్ని ఏళ్లుగా కలగానే మిగిలింది. మండలంలో పదుల సంఖ్యలో ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలలు, విద్యాసంస్థలు, కార్యాలయాలు, పొగాకు బ్యారన్లు, రెండు సినిమాహాళ్లు, జాతీయ రహదారి, దుకాణ సముదాయాలు నెలకొని ఉన్నాయి. దీంతో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో మండల పరిధిలో ఏ అగ్ని ప్రమాదం ముంచుకోస్తుందో తెలియక ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ప్రతి ఎన్నికల్లోను ప్రజాప్రతినిధులు తాము అధికారంలోకి వస్తే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీలు ఇవ్వడం, అనంతరం ప్రతిపాదనలకే పరిమితం కావడంతో నియోజకవర్గ ప్రజలు ఆశలు వదులుకున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు అధికారులు దేవరపల్లిలో అవసరమైన స్థలాన్ని సేకరించారు. అనంతరం తలారి వెంకట్రావు కొవ్వూరు ఇన్చార్జిగా వెళ్లడంతో గోపాలపురం ఇన్చార్జిగా బాధ్యతలు తీసుకున్న తానేటి వనిత అగ్నిమాపక కేంద్రం నిర్మాణంపై దృష్టిపెట్టారు. ఎట్టకేలకు 2024 మార్చి 15న దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల అనంతరం ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో శంకుస్థాపన కార్యక్రమం వాయిదా పడింది.


అగ్నిమాపక వాహనం (ఫైల్)


దుద్దుకూరు హైవేపై ప్రమాదంలో దగ్ధమవుతున్న లారీ (ఫైల్)

రూ.2.74 కోట్ల మంజూరు

మండలంలో స్టేషన్ నిర్మాణానికి రూ.2,74,33,000 మంజూరు చేస్తూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 18 మంది సిబ్బందిని కొత్తగా నియమించడంతో పాటు అగ్నిమాపక అధికారి, లీడింగ్ ఫైర్‌మెన్‌లు ముగ్గురు, ఫైర్‌మెన్‌లు 13 మంది, స్వీపర్ పోస్టుతో మొత్తం 18 మందిని కొత్తగా నియమించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సిబ్బంది నియామకానికి రూ.85.05 లక్షలు, స్టేషన్ నిర్మాణానికి రూ.1,89,28,000 మంజూరు చేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడం, అధికారులు సేకరించిన స్థలానికి న్యాయపరమైన చిక్కులు ఏర్పడటం ,అనంతరం యర్నగూడెం శివారు సూర్యనారాయణపురం టోల్‌ప్లాజా సమీపంలో దాత 30 సెంట్లు స్థలం ఉచితంగా ఇవ్వడంతో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి చిక్కులు వీడాయి. సుమారు రూ. కోటి వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేసి నిధుల కోసం ప్రభుత్వానికి పంపించి వేచిచూస్తున్నారు.

పొగాకు రైతులకు నష్టం

నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాలకు ఈ ఫైర్ స్టేషన్ ఉపయోగపడుతుంది. ఇప్పటి వరకు దేవరపల్లి మండలానికి కొవ్వూరు, నిడదవోలు నుంచి, గోపాలపురం మండలానికి జంగారెడ్డిగూడెం, నల్లజర్ల మండలానికి తాడేపల్లిగూడెం, ద్వారకాతిరుమల మండలానికి భీమడోలు అగ్నిమాపక కేంద్రం నుంచి ప్రమాదాల సమయంలో అగ్నిమాపక కేంద్రాల నుంచి వాహనాలు వస్తున్నాయి. దాదాపు 20 నుంచి 30 కిలో మీటర్ల దూరంలో అగ్నిమాపక కేంద్రం ఉండడంతో ప్రమాదాలు జరిగిన సమయంలో తీవ్రంగా నష్టం జరుగుతుంది. నియోజకవర్గంలో ఎక్కువగా పొగాకు బ్యారన్లు ఉండడం, క్యూరింగ్ సమయంలో అగ్నిప్రమాదాలు సంభవించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అగ్నిప్రమాదం జరిగితే సుమారు రూ. 5 నుంచి 10 లక్షలు రైతు నష్టపోతున్నారు.

ప్రమాదాలను నివారించవచ్చు



మండల పరిధిలోని హైవేపై ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో వాహనాల్లో అగ్నిప్రమాదాలు సంభవించి ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం ఎక్కువగా జరుగుతుంది. స్టేషన్ నిర్మాణం పూర్తయితే కొంతమేర ప్రమాదాల తీవ్రతను నివారించవచ్చు.

– సత్తి జగదీశ్వరరెడ్డి, పొగాకు రైతు సంఘం ప్రతినిధి, కృష్ణంపాలెం

ప్రజల ఆకాంక్ష నెరవేరుతుంది



నిడదవోలు, రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, దేవరపల్లిలో కొత్తగా ఫైర్ స్టేషన్లు మంజూరయ్యాయి. దేవరపల్లి ఫైర్ స్టేషన్‌కు రూ.1 కోటి, మిగిలిన స్టేషన్లకు ఒక్కొక్క దానికి రూ.1.86 కోట్లు మంజూరయ్యాయి. వచ్చే మార్చి నాటికి ఫైర్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేస్తాం

– సీహెచ్ మార్టిన్ లూథర్ కింగ్, జిల్లా అగ్నిమాపక అధికారి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

జాతీయతా భావాన్ని పెంపొందించుకోవాలి

గోపాలపురం: దేశ ప్రజల్లో జాతీయతా భావాన్ని పెంచాలనే దిశగా కేంద్రం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మండల విద్యాశాఖా అధికారి జీ. శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం గోపాలపురంలోని స్థానిక జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాల విద్యార్థులు, బీజేపీ నాయకులతో కలిసి జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లి వెంకటేశ్వరరావు, గెల్లా శ్రీనుబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నిడదవోలు: విద్యార్థులంతా నులి పురుగులు దరి చేరకుండా చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ ఇ.నాగేశ్వరరావు అన్నారు. నిడదవోలు వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.పద్మజ, సీహెచ్ సుబ్బారావు, వి.కనకదుర్గ పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వాల పరిపాలనలో మహిళల కీలకం


ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు ట్రస్ట్ సభ్యులు, అధ్యాపకులు

నిడదవోలు: స్థానిక ప్రభుత్వాల పరిపాలనలో మహిళల పాత్ర చాలా కీలకమని డీపీఆర్‌సీ జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గుర్రాల ప్రసంగిరాజు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని నిడదవోలు ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మనోజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక స్వపరిపాలన–మహిళల పాత్ర అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలంతా తమ హక్కులు సద్వినియోగం చేసుకుని సుపరిపాలన అందించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కుంచాల విజయ, ట్రస్ట్ ఫౌండర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ డి.రుద్ర, వైస్ ప్రిన్సిపల్ కంబయ్య, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి.ఉషారాణి, అధ్యాపకులు జె.శోభారాణి, డి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని రామన్నపాలెం సబ్ స్టేషన్‌లోని 11 కేవీ రూరల్ ఫీడర్‌పై పరిధిలోని ఆర్డీఎస్ పనుల నిమిత్తం బుధవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్. నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీ.ఐ బాలశౌరి

నల్లజర్ల: అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం వివిధ అంశాలపై నల్లజర్ల సీ.ఐ బాలశౌరి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు స్నేహాలు పట్టి మాదకద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తును చేతులారా పాడు చేసుకున్నట్టేనన్నారు. జూనియర్స్‌తో సీనియర్లు స్నేహపూరితంగా, మార్గదర్శకులుగా ఉండాలే తప్ప ర్యాగింగ్‌కు పాల్పడవద్దన్నారు. పోలీస్ కేసులలో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని ఉత్తమ పౌరులుగా ఎదిగి జాతి నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టరు అరవింద కుమార్, ఎంబీఏ హెడ్ డాక్టరు ఏయస్ ప్రసాద్, జి.రవికుమార్, సురేష్, ఏఎస్ఐ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

14న ఉచిత కంటి వైద్యశిబిరం

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామ సచివాలయం వద్ద రేపు ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఆరేపల్లి చిన నంగాలు మంగళవారం తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్రవైద్యశాల బృందం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు ఉచితంగా అందజేయడంతో పాటు ఆపరేషన్లు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ శిబిరాన్ని పరిసర ప్రాంతాల గ్రామప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వ్యక్తిగత దూషణలు మంచిది కాదు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి, మాజీ హోంమంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనితపై టీడీపీ నాయకులు వ్యక్తి గత దూషణలు చేయడం మంచి సాంప్రదాయం కాదని స్థానిక ఎంపీపీ కేవీకు దుర్గారావు హితవుపలికారు. యర్నగూడెం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలో ఉన్నా నియోజకవర్గంలో వ్యక్తి గత దూషణల సాంప్రదాయం ఎప్పుడూ లేదన్నారు. సోషల్ మీడియాలో మాజీ హోంమంత్రి తానేటి వనితపై అసభ్యకర పోస్టులు పెట్టడం మంచి పద్ధతి కాదని కూటమి పార్టీలను హెచ్చరించారు. వ్యక్తి గత దూషణలు, కక్షలకు పాల్పడితే టీడీపీకే నష్టం జరుగుతుందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలు ఎంత వరకు అమలు చేస్తున్నారనేది పరిశీలన చేసుకోవాలన్నారు. తల్లికి వందనం అని చెప్పి ఆర్భాటం చేశారుగాని ఇప్పటికి పూర్తిగా తల్లుల ఖాతాలకు నగదు జమకాలేదని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జిల్లా సరిహద్దు దాటే పరిస్థితి లేదన్నారు. రైతు భరోసా రూ. 20 వేలు ఇస్తామని చెప్పి రూ. 5 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తిట్టే సమయాన్ని సూపర్ సిక్స్ పథకాల అమలుకు కేటాయించాలని ఆయన సూచించారు.


యర్నగూడెం పార్టీ కార్యలయంలో విలేకర్లతో మాట్లాడుతున్న దుర్గారావు, పార్టీ నేతలు

జగన్‌ను విమర్శించడానికే సుపరిపాలన

మండల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్ మాట్లాడుతూ వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడానికే టీడీపీ సుపరిపాలన కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఏడాది కూటమి పాలనలో చేసిన అభివృద్ధి, ప్రజలకు జరిగిన మేలు చెప్పకుండా వ్యక్తి గత దూషణలకు పాల్పడుతున్నారన్నారు. అభివృద్ధి అంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి తెలుసుకవాలన్నారు. అనంతరం రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్ర బాబు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుసులూరి వెంకటసతీష్, మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి గంగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సత్తి సాయి ఈశ్వరరరెడ్డి, పార్టీ నేతలు సత్తి జగదీశ్వరరెడ్డి, బళ్ల బాబులు, బళ్ల సత్యనారాయణ, నరహరిశెట్టి సుధాకర్, బొంతా భరత్‌బాబు, పాపోలు వెంకటకృష్ణారావు, దోనెల్లి జానకీరాం, సాదే సుబ్బారావు, షేక్ ముస్తఫా, సున్నం వర ప్రసాద్, మండల మహిళా అధ్యక్షురాలు కడలి హైమావతి, గుత్తికొండ అచ్యుతరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి కార్మికుల నిరసన

- తొమ్మిది నెలలుగా జీతాలు అందక అవస్థలు
- ఈ నెల 22వ తేదీలోగా సమస్య పరిష్కరించాలని డిమాండ్
- లేకుంటే 17 మండలాలకు మంచినీటి సరఫరా నిలివేస్తామని హెచ్చరిక

గోపాలపురం: సత్యసాయి మంచినీటి పథకంలో పని చేస్తున్న తాము తొమ్మిది నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్నామని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మికులు మంగళవారం సత్యసాయి ట్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించకపోవడం వల్ల తమ కుటుంబాలు రోడ్డు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సత్యసాయి మంచినీటి పథకాన్ని ప్రభుత్వమే నిర్వహిస్తుందని ఎన్నికల్లో హామీ ఇచ్చిన నారా లోకేష్, ఇతర నాయకులు మమ్మల్ని పట్టించుకోవడం లేదని కార్మిక నాయకుడు తానేటి రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని, సత్యసాయి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, చనిపోయిన కార్మికుడి కుటుంబంలో వ్యక్తికి ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదీలోగా సత్యసాయి కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే 17 మండలాలకు సరఫరా చేసే మంచినీటిని నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్మిక నాయకుడు రవి

పంచ సూత్రాలతోనే లైబ్రరీల అభివృద్ధి


చంద్రవరం శాఖా గ్రంథాలయంలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

చాగల్లు: గ్రంథాలయ పంచ సూత్రాల రూపకర్త పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతిని చంద్రవరం శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథ పాలకుడు కె.సుమన్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి పాఠకుడు సులభంగా గ్రంథాలయంలో పుస్తకాలను తీసుకోవడానికి, పాఠకులకు మరింత ఎక్కువ సేవలను అందించడానికి ఆయన రూపొందించిన పంచ సూత్రాల కారణంగా నేడు గ్రంథాలయాలు ఎంతో సుభిక్షంగా ఉన్నాయాని కొనియాడారు.


ముక్కామలలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

రంగనాథన్ కృషితోనే మనుగడ

పెరవలి: గ్రంథాలయాల ఏర్పాటుకు రంగనాథన్ చేసిన కృషి, ఆయన ప్రవేశ పెట్టిన పంచ సూత్రాలు, సంస్కరణలు వలనే నేడు గ్రంథాలయాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని గ్రంథాలయాధికారులు, వక్తలు యం.వెంకటేశ్వర్లు, జయలక్ష్మి కొనియాడారు. మండలంలోని తీపర్రు, పెరవలి, ముక్కామల శాఖా గ్రంథాలయాల్లో ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి, నివాళులర్పించారు. విద్యార్థులు నిత్యం పుస్తకపఠనం ఆచారించాలని సూచించారు.

ఆరుతడితో పద్ధతులతో అధిక దిగుబడులు

పెరవలి: ఖరీఫ్ సాగులో ఆరుతడి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారిణి మేరీ కిరణ్ తెలిపరు. మండలంలోని ముక్కామలలో మంగళవారం రైతులకు ఆరుతడి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం న్విహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని పంటకు నీటిని తక్కువగా అందించటం వలన పంటకు ఎటువంటి తెగుళ్లు సోకవని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సాకా రామకృష్ణ మాట్లాడుతూ డెల్టా నీటిని ఎక్కువగా వినియోగించటంతో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉందని ఈ తెగుళ్లను నివారించటానికి కేవలం నీటి తడులు సక్రమంగా ఇవ్వటమేనని తెలిపారు. ఆరుతడి వ్యవసాయంలో ప్రధానమైనది తడులు ఇవ్వటమే కానీ నీటితో నింపటం కాదని చెప్పారు.


ముక్కామలలో ఆరుతడి పంటల గురించి రైతులకు వివరిస్తున్న మేరీ కిరణ్

ఆరుతడితో నీటి వృథాను అరికట్టవచ్చు

ఉండ్రాజవరం: ఆరుతడి వ్యవసాయంతో నీటిని వృథా కాకుండా, పురుగులు, తెగుళ్లను సమూలంగా నివారించవచ్చునని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు రైతులకు సూచించారు. మండల పరిధిలోని వరిపంటలో ఆరుతడి వ్యవసాయంపై రైతులకు క్షేత్రస్థాయిలో శిక్షణ, పాలంగి, వెలగదుర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ మాట్లాడుతూ వరిలో రసం పీల్చే పురుగులు, కాండం తొల్చే పురుగులు, మాగుడు, పచ్చ పురుగు నివారణ కోరకు వేప గింజల ఇంగువ, కుంకుడు రసం పిచికారి చేయడం వలన ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. వీటిని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డ్రోన్ సహాయంతో పిచికారి చేస్తున్నారన్నారు. ఇలా చేయడం వలన తక్కువ ఖర్చుతో దిగుబడి పెంచవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఇందిరా, మౌనిక, ముత్యాలు, ఉమామహేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

బీమా దరఖాస్తుకు గడువు ముగింపు

దేవరపల్లి: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా పంట రుణం పొందని రైతులు ఈ నెల 15వ తేదీ లోగా ఎకరాకు వరి పంటకు రూ.575, మినుము వేసిన రైతులు రూ.300 చొప్పున ప్రీమియం చెల్లించి బీమా పొందాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్ రైతులకు సూచించారు. మండలంలోని దుద్దుకూరు, గౌరీపట్నం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట రుణం తీసుకున్న రైతులకు ఈ నెలఖారు వరకు పంట బీమా చేసుకొనే అవకాశం ఉందన్నారు. సార్వాలో పంట వేసిన ప్రతి రైతు బీమా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్‌పర్సన్ కరుటూరి శ్రీరామమూర్తి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నానోతో నాణ్యమైన దిగుబడులు

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు మండలం దొమ్మేరు , పెనకనమెట్ట గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులందరు పైపాటుగా నానో యూరియా వాడుకోవాలని సూచించారు నానో యూరియా అన్ని పంటలకు ఉపయోగించవచ్చని, మొక్కల పెరుగుదల, నాణ్యమైన పంటకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నేల,నీరు,వాయు కాలుష్యన్ని తగ్గిస్తుందని చెప్పారు. నానో యూరియా పూర్తిగా మొక్క పెరుగుదలకు ఉపయోగపడాతుందన్నారు.

నులిపురుగుల మాత్రల పంపిణీ


పెరవలిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంపీపీ ప్రసాద్, వైద్యాధికారి ప్రసాద్


సమిశ్రగూడెంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది


నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న సీహెచ్ఓ

పెరవలి: జాతీయ నులిపురుగుల నివారణలో భాగంగా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మాత్రలను వేసుకుంటే నులిపురుగులను నివారించవచ్చని ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ అన్నారు. మండలంలోని కానూరు, పెరవలి పీహెచ్‌సీల పరిధిలోని విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను ఆయా పాఠశాలల్లో మంగళవారం వేశారు. వైద్యాధికారి ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ పెరవలి పీహెచ్‌సీ పరిధిలో 4,952, కానూరు పీహెచ్‌సీ పరిధిలో 3,958 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వీరందరికి ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మాత్రలు వేశారని, పాఠశాలకు రాని పిల్లలకు వైద్య సిబ్బంది మరోసారి అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు భావన మధు, బీరా సత్యవేణి రాజు, గంగోలు సీతమ్మ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

నిడదవోలు రూరల్: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి అల్బెండజోల్ మాత్రలు దోహదపడతాయని సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివాజీ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని సమిశ్రగూడెంలోని ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు మంగళవారం పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో 2,400 మంది చిన్నారులకు మాత్రలు వేశామన్నారు. వైద్యురాలు ఎం.శ్రీనిధి, పీహెచ్‌సీ సిబ్బంది మురళీకృష్ణ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

నల్లజర్ల: నులి పురుగులు చిన్నారుల ఆరోగ్యాన్ని నులిపేస్తూ వారి ఎదుగుదలకు ప్రతిబంధకంగా మారతాయని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా పిల్లలతో డీవార్మింగ్ మాత్రలు మింగించాలని పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం పార్డ్ ఇండియా సభ్యులు దూబచర్ల సబ్ సెంటర్ పరిధిలో పలు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ షేక్ జరీనా మాట్లాడుతూ చిన్నారులకు చేతివేళ్ల గోళ్ల ద్వారా నులిపురుగులు కడుపులోకి చేరి ఇన్‌ఫెక్షన్‌లకు దారితీస్తాయన్నారు. చిన్నారుల్లో రక్తహీనత, బరువు తగ్గడం, కడుపునొప్పి, తరుచూ జ్వరం రావడం, కడుపు ఉబ్బరంతో బాధపడుతుంటారన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి ప్రబలకుండా నివారించవచ్చునన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం డీవార్మింగ్‌డే సందర్భంగా 12,884 మంది విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలు మిగించినట్టు పీహెచ్‌సీ డాక్టరు గంగాధరరావు తెలిపారు. 20 వ తేదిన మాప్‌అప్‌డే రోజున మిగిలిన విద్యార్థులకు మాత్రలు వేస్తామన్నారు. సీహెచ్‌ఓ వెంకటశాస్త్రి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పోతవరంలో..

పోతవరం పీహెచ్‌సీ పరిధిలో డాక్టరు సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు అందించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు యం.జయప్రకాష్, మీరాబాయి, కృష్ణ కుమారి, యం.యల్.హెచ్.పీ సంకీర్తన, ఆశలు, ఏఎన్‌యంలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులే బాధ్యత వహించాలి

ఉండ్రాజవరం: పిల్లల్లో నులి పురుగుల నివారణకు తల్లిదండ్రులు బాధ్యత వహించాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు, వేలివెన్ను పీహెచ్‌సీ వైద్యులు ఇర్ఫాన్ సూచించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 5,596 మంది పిల్లలకు గాను, 5,428 మంది, వేలివెన్ను పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 8,673 మంది పిల్లలకు 6,674 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశామన్నారు.

తాళ్లపూడి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలో మంగళవారం మలకపల్లి, తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.అన్నపూర్ణ చిన్నారులకు భోజనం అనంతరం మాత్రలు వేశారు. తాళ్లపూడి పీహెచ్‌సీ పరిధిల్లో మొత్తం 6,527 మందికి, మలకపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలోని 3,515 మంది పిల్లలకు మాత్రలు అందజేశామన్నారు. వైద్యాధికారులు పీహెచ్‌సీ డాక్టర్ హారిక, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.